నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు

- పాలమూరు కలెక్టర్ విజయేందిరబోయి
- నియంత్రణపై పాలమూరులో టాస్క్‌ఫోర్స్ సమన్వయ సమావేశం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 23: ప్రభుత్వ అనుమతి లేని బీజీ-3 పత్తి విత్తనాలు అమ్మడం చట్టరీత్యా నేరం.. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపట్టే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయడంతోపాటు పదేళ్లు జైలు శిక్ష ఖాయమని కలెక్టర్ విజయేందిర బోయి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నకిలీ పత్తి విత్తనాల నియంత్రణపై టాస్క్‌ఫోర్స్ సమన్వయ సమావేశం నిర్వహించారు. నకిలీ బీజీ-3 విత్తనాల వల్ల భూసారం దెబ్బతినడంతోపాటు వాతావరణం కలుషితమవుతుందన్నారు. నకిలీ పత్తి విత్తనాలు నియంత్రణకు పోలీసు, వ్యవసాయశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈనెల 24నుంచి 28వ తేదీ వరకు 16 టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలో 259 డీలర్ కౌంటర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో గడువు తేదీ దాటిన విత్తనాలు అమ్మినా, నిల్వ ఉంచినా, అనుమతి లేని నకిలీ విత్తనాలు విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నాణ్యమైన బీజీ-2 పత్తి విత్తనాలు మాత్రమే రైతులు లైసెన్స్, కౌంటర్ డీలర్ల నుంచి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్పీ జానకి మాట్లాడుతూ.. పోలీసుశాఖ తరపున నకిలీ పత్తి విత్తనాల నియంత్రణకు పోలీసు శాఖ తగిన ఫోర్స్‌తో 24గంటలు అందుబాటులో ఉందన్నారు. వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎలాంటి సమాచారం ఉన్నా ముందుగా పోలీసుశాఖకు తెలిపితే తగిన ఫోర్స్‌ను పంపిస్తామన్నారు. అనంతరం డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు.

పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

ఈనెల 25న నిర్వహించనున్న గ్రామ పరిపాలనా అధికారుల పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు. పరీక్ష నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో డిప్యూటీ కలెక్టర్, లైజన్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, చీఫ్ సూపరింటెండెంట్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఆదివారం ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు బస్టాండ్ సమీపంలోని చైతన్య హైస్కూల్‌లో పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు అభ్యర్థులను హాల్‌లోకి అనుమతిస్తారని ఉదయం 10గంటల తర్వాత అభ్యర్థులకు పరీక్ష హాల్‌లోకి అనుమతి లేదని తెలిపారు. నిమిషం నిబంధన అమలులో ఉంటుందని.. అభ్యర్థులు గుర్తించుకోవాలన్నారు. అభ్యర్థులు ఇటీవల పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటో, గుర్తింపునకు పనిచేస్తున్న కార్యాలయ అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డు (ఐడెంటిటీ కార్డు) ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. హాల్‌టికెట్‌పై అభ్యర్థి ఫొటోపై సంబంధిత కార్యాలయ అధికారి సంతకం తప్పనిసరి అన్నారు. సమావేశాల్లో అదనపు ఎస్పీ రాములు, ఆర్డీవో నవీన్, డీఎంహెచ్‌వో కృష్ణ, ఫారెస్టు అధికారి సత్యనారాయణ, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, సీఎంవో బైకనిబాలుయాదవ్, వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్, మహబూబ్‌నగర్ రూరల్ తాసీల్దార్ సుందర్‌రాజు, అర్బన్ డీటీ కేసీ రెడ్డి దేవేందర్, డిప్యూటీ నోడల్ అధికారి అనిరుధ్ నటరాజన్, చీఫ్ సూపరింటెండెంట్ మహ్మద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల నియంత్రణపై మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి, పాల్గొన్న ఎస్పీ జానకి, టాస్క్‌ఫోర్స్ అధికారులు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

అవార్డు గ్రహీతకు మాజీ మంత్రి సన్మానం

కేశవులును సన్మానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

హన్వాడ, మే 23: దళితరత్న అవార్డు అందుకున్న నమస్తే తెలంగాణ విలేకరి కేశవులును శుక్రవారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరింపజేసే లక్ష్యం కేశవులుదని పేర్కొన్నారు. అవార్డు రావడంతో ఆయనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జంబులయ్య, నాయకులు బాలకృష్ణయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్‌లు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో గ్రామాలాభివృద్ధి

హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

- ఎంపీ డీకే అరుణ

మరికల్, మే 23: కేంద్రం నిధులతోనే గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మండలంలోని పసుపులలో రూ.2.50లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం ప్రతిపల్లెకు ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన శివలింగ, నాభి శిల, ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, మరికల్ మండలాధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నసూక్తంతో రూపాయికే భోజనం

- 100 డ్రీమ్స్ ఫౌండేషన్ సంస్థ శ్రీకారం

అన్నసూక్తం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కృష్ణమానినేని

బాలానగర్, మే 23: పేదలకు ఒక్క రూపాయికే భోజనం అందించేందుకు 100 డ్రీమ్స్ ఫౌండేషన్ సంస్థ శుక్రవారం బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో శ్రీకారం చుట్టింది. 100 డ్రీమ్స్ వ్యవస్థాపకుడు కృష్ణ మానినేని ఆధ్వర్యంలో పేదల కడుపు నింపేందుకు చేపట్టిన అన్నసూక్తం కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, 100 డ్రీమ్స్ వ్యవస్థాపకుడు కృష్ణ మానినేని, వైద్యురాలు చంద్రకళ ప్రారంభించారు. బాలానగర్ మండలంలో అన్నసూక్తం కేంద్రం నిర్వహణ బాధ్యతను పెద్దాయపల్లికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి స్వీకరించారు. రోజుకు 25మంది పేదలకు రూపాయికే భోజనం అందించనున్నట్లు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, దత్తాత్రేయ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

జడ్చర్లలో ప్రారంభమైన అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నమెంట్

జడ్చర్లటౌన్, మే 23: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జడ్చర్లలోని మినిస్టేడియం మైదానంలో అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ జట్టు కోచ్ సతీశ్, నిర్వాహకులు ఎంఏ మన్నాన్, మహేశ్‌బాబు, ముజీబ్, రాంరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ టోర్నీలో మొదటగా మహబూబ్‌నగర్, జడ్చర్ల జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. రెండు రోజులపాటు జరుగనున్న అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీలో రాణించిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళలు స్వయం ఉపాధిని సృష్టించుకోవాలి

- వీవీ విజనరీ డైరెక్టర్ దర్శిని

వెల్కిచర్లలో మాట్లాడుతున్న వీ.వీ విజనరీ డైరెక్టర్ దర్శిని

అగర్‌బత్తీలను తయారు చేస్తున్న మహిళలు

భూత్పూర్, మే 23: మహిళలు స్వయం ఉపాధిని సృష్టించుకోవాలని వీవీ విజనరీ డైరెక్టర్ దర్శిని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెల్కిచర్ల జీపీ కార్యాలయంలో నైపుణ్యాలపై కర్ణాటకకు చెందిన వీవీ విజనరీ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి అక్షరాస్యత లేని మహిళలు సైతం మా సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను గుర్తించి ఉపాధిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్థ ద్వారా అగర్‌బత్తీలు, చీరలపై ఎంబ్రాయిడరీ, బుట్టలు అల్లడంవంటి పనులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన మెటీరియల్‌ను తామే ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తయారు చేసిన వస్తువులను మా సంస్థనే మార్కెటింగ్ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ ఆశారాణి, టీం లీడర్ సాజిదా బేగం తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా అనుమతులు మంజూరు చేయాలి

- పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, మే 23: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుంచి మంజూరు చేయాల్సిన అనుమతులు గడువులోగా మంజూరు చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎస్సీ 9, ఎస్టీ 6, పీహెచ్‌సీ 1కి పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు కమిటీలో ఆమోదం తెలిపారు.

బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలి

బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన డీసీసీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, ఎంఎస్ఎంఈకి త్వరితగతిన అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. 2025-26కుగానూ వార్షిక రుణ ప్రణాళిక రూ.4,204.98 కోట్లుగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇందులో రైతుల పంట రుణాలకు రూ. 2,195.07 కోట్లు, వ్యవసాయ ఇతర మౌలిక సదుపాయాలకు రూ.1,275.87 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు సూక్ష్మ తరహా పరిశ్రమలకు రూ.148 కోట్లు, చిన్న తరహా పరిశ్రమలకు రూ.162.30కోట్లు ఇతర వ్యవసాయేతర రంగాలకు రూ.52.24 కోట్లు మంజూరు చేయాలని నిర్దేశించినట్లు తెలిపారు. అనంతరం ఏసీపీ 2025-26 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయా సమావేశాల్లో జీఎం భరత్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్, డీఎఫ్‌వో సురేశ్‌రెడ్డి, ఆర్టీవో మేఘాగాంధీ, ఆర్బీఐ ఏజీఎం శ్రావ్య, నాబార్డ్ డీడీఎం షణ్ముఖాచారి, ఎల్‌డీఎం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నేడు సన్నాహక సమావేశం

జడ్చర్లటౌన్, మే 23 : ఇన్నాళ్లు రైల్వేగేటు సమస్యతో ఇక్కట్లు ఎదుర్కొన్న జడ్చర్లలోని పాతబజార్‌వాసులకు తాజాగా అంబేద్కర్ చౌరస్తా డిజైన్ మార్పుతో ఆర్టీసీ బస్సులు, లారీల ప్రయాణానికి అటంకం ఏర్పడితే భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచే పాతబజార్‌కు భారీ వాహనాలు మళ్లేలా రహదారి నిర్మాణం చేయాలని పాతబజార్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధనకు ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రహదారి భవిష్యత్ కార్యాచరణపై పాతబజార్‌వాసులు శనివారం జడ్చర్లలోని గౌడ ఫంక్షన్‌హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. మొదటగా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆ తర్వాత ఉద్యమానికి నాంది పలకాలని నిర్ణయించుకునేందుకు పాతబజార్‌వాసులు సమావేశం కానున్నారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

మద్దూర్, మే 23: ఉరేసుకుని వ్యక్తి మృతిచెందిన ఘటన మద్దూర్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. కోయిల్‌కొండ మండలంలోని దమ్మాయిపల్లికి చెందిన రాంచంద్రయ్య(42)మద్దూర్‌లో వెంకటేశ్వర డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహణలో నష్టం రావడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం 9:30 గంటలకు మద్దూర్‌లోని ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని నారాయణపేట దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

శుభకార్యానికి వచ్చి.. అనంత లోకాలకు..

బాలానగర్ (రాజాపూర్), మే 23: బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చిన ఓ వ్యక్తి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై అనంతలోకాలకు వెళ్లిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. రాజాపూర్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో నివాసముంటున్న మిడ్జిల్ మండలం మన్నన్నూరుకు చెందిన దేవతల యాదయ్య (55), భార్య యాదమ్మతో కలిసి నవాబ్‌పేటలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యారు. భార్యాభర్తలు బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా జాతీయ రహదారిపై రాజాపూర్ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న అజాక్స్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌పై అవగాహన

నారాయణపేట, మే 23: మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెడ్‌కానిస్టేబుల్ నారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని తెలియజేశారు.

ముగింపు దశకు కొనుగోళ్లు

- పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సైదులు

నారాయణపేట టౌన్, మే 23: పేట జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో వరిధాన్యం సేకరణ ముగింపు దశకు చేరిందని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సైదులు తెలిపారు. శుక్రవారం ఆయన నమస్తే తెలంగాణతో మాట్లాడారు. మొదట్లో 1.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, రైతులు బోనస్ వస్తుందని ఆశతో బయటి మార్కెట్‌లో ధాన్యం విక్రయించలేదని దీంతో ఎక్కువ మొత్తంలో ధాన్యం రావడంతో ప్రస్తుతం 1.95లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. నేటితో 25,180 మంది రైతులతో 1,79,615 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు చెప్పారు. 1,77,066 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించామని, మిగతా 2,548 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రెండు రోజుల్లో మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. ఈ యాసంగిలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, ఎఫ్‌పీవో, ఏఎమ్‌సీల ఆధ్వర్యంలో మొత్తం 100 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని 99 కేంద్రాల్లో దాదాపుగా ధాన్యం సేకరణ పూర్తయిందని, మాగనూర్ మండలంలోని నేరేడ్‌గమ్‌లో మాత్రం రైతులు ధాన్యం తీసుకొస్తున్నారని తెలియజేశారు. మొత్తం 18,570 మంది రైతుల ఖాతాల్లో రూ.275.87కోట్లు చెల్లింపులు జరిపినట్లు తెలిపారు. త్వరలో మిగతా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

బాలకేంద్రాలతో కళ లకు జీవం

నారాయణపేట టౌన్, మే 23: బాలకేంద్రాలు సాంప్రదాయ కళలకు జీవం పోస్తున్నాయని డీఈవో గోవిందరాజులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలకేంద్రాన్ని సందర్శించారు. బాల కేంద్రంలో చిన్నారులకు ఇస్తున్న శిక్షణను గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు తమకు నచ్చిన కళను నేర్చుకొని అందులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సిబ్బంది నర్సింహులు, వసంత్‌కుమార్, జ్ఞానామృత, వ్యాయామ ఉపాధ్యాయులు రమణ పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని మినీ స్టేడియంలో కొనసాగుతున్న క్రికెట్ సమ్మర్ క్యాంప్‌ను సందర్శించారు.

క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

మహబూబ్‌నగర్ అర్బన్,మే 23 రాష్ట్ర క్రీడా అకాడమీ సంస్థ(శాట్స్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా వసతిగృహాల్లో 2025-26 విద్యాసంవత్సరం ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. వాలీబాల్, హాకీ, హ్యాండ్‌బాల్, సైక్లింగ్, రెజ్లింగ్, అథ్లెంటిక్స్, జిమ్నాస్టిక్‌లో ప్రవేశాలకు బాలికలు, బాలుర విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. వాలీబాల్ అకాడమీకి- సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, సరూర్‌నగర్ (హైదరాబాద్)లో జూన్ 1న, మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో జూన్ 12, 13న, సైక్లింగ్ అకాడమీ కోసం-సైక్లింగ్ వెలోడ్రోమ్, ఓయూ క్యాంపస్ హైదరాబాద్‌లో జూన్ 10, 11వ తేదీన, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, హ్యాండ్‌బాల్‌కు - డీఎస్ఏ హన్మకొండలో జూన్ 10, 11న, హాకీ అకాడమీకి - బాలకిష్టయ్య మినీ స్టేడియం వనపర్తిలో జూన్ 12న, అథ్లెటిక్ అకాడమీకి- డీఎస్ఏ ఖమ్మంలో జూన్ 12న నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్హత, ఆధార్ కార్డు, క్రీడా ధ్రువీకరణ పత్రాలు, 10పాస్‌ఫొటోలతో సంబంధిత కార్యాలయంలో ఉదయం 7 గంటల వరకు హాజరుకావాలని సూచించారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్‌కు ఎంపిక

ధన్వాడ, మే 23: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని అల్ఫాన్ అకాడమీ ఇండోర్ సిటీలో ఈనెల 25 నుంచి 28వ రకు జరిగే 31వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల నెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొనేందుకు ధన్వాడకు చెందిన కె.శైలజ, కె.శివకుమార్ ఎంపికయ్యారని జిల్లా నెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్‌గౌడ్, అంజద్ అలీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వీరు ఈనెల 15నుంచి 18వరకు జనగాం జిల్లాలో జరిగిన 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల నెట్‌బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచారు. వీరి ఎంపికపై ధన్వాడ క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

శైలజ

శివకుమార్

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 23: వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతనెలలో జరగాల్సిన బహిరంగ సభను అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన సాయంత్రం 7గంటలకు జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు, ప్రజాస్వామికవాదులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో షబ్బీర్ అహ్మద్, ఎండీ.ఫయాజ్, అజ్మత్‌అలీ, ఫక్రుద్దీన్, ఖురేషీ, ఖాజా పాషా, అంజద్, పీర్ సాధిక్, ఫహీం తదితరులు పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించాలి

జడ్చర్లటౌన్, మే 23: ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలని కోరుతూ బీసీ జాగృతిసేన ఆధ్వర్యంలో శుక్రవారం తాసీల్దార్ నర్సింగ్‌రావు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీసీ జాగృతిసేన నాయకులు మాట్లాడుతూ.. జడ్చర్లలో నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న పాఠశాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ జాగృతిసేన మండలాధ్యక్షుడు నర్సింహులు, విజయ్‌కుమార్, శేఖర్, చెన్నయ్య, వెంకటేశ్, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

గోరక్ష చట్టాలను అమలు చేయాలి

జడ్చర్లటౌన్, మే 23: గోరక్ష చట్టాలను అమలు చేయాలని కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శుక్రవారం తాసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడారు. గోవధ శాలలు, గోవుల అక్రమ రవాణా, అనుమతి లేని కబేళాలాను మూసివేయాలని డిమాండ్ చేశారు. గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జగపాల్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణాలు వేగం వేయాలి

నవాబ్‌పేట, మే 23: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో జయరామ్‌నాయక్ సూచించారు. మండలంలోని ఊరంచుతండా, కారుకొండలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మార్క్ అవుట్ వేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హరలింగం, ఎంపీవో భద్రునాయక్, నాయకులు శంకర్‌నాయక్, భూపాల్‌రెడ్డి, రాములునాయక్, నీల కంఠం, నర్సింహ, సత్యం కవిత, రాజు పాల్గొన్నారు.

బాల్య వివాహానికి బ్రేక్

మక్తల్, మే 23: మండలంలోని గొల్లపల్లిలో శుక్రవారం బాల్యవివాహం చేస్తున్నారని తొందర వ్యక్తులు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు ఉదయం ఎనిమిది గంటల 45 నిమిషాలకు గ్రామానికి చేరుకొని బాల్య వివాహం చేస్తున్న బాలికను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇట్టి విషయంపై మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డికి వివరణ కోరగా.. గొల్లపల్లిలో బాల వివాహం చేస్తున్నారనే సమాచారం వచ్చినట్లు పేర్కొన్నారు.

దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధం కావాలి

నారాయణపేట, మే 23: దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ పిలుపునిచ్చారు. మనం సైతం దేశం కోసం సైనికులకు వందనం అనే ప్రత్యేక కార్యక్రమంతో శుక్రవారం పట్టణంలోని మెయిన్ చౌక్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై..వందేమాతరం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గం ఉగ్రదాడి అనంతరం ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రస్థావరాలపై దాడులు చేసి దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ఇతర దేశాలు మన దేశం వైపు కన్నెత్తి చూడాలన్న హడలెత్తేలా చేశారన్నారు. ఎప్పటికైనా పీవోకే మనదేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, నాయకులు రతంగపాండురెడ్డి, శ్రీనివాసులు,